## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకాలు



స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

**మండపేట:** ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని బురుగుంట చెరువు వద్ద గల సీతారామ క్షేత్రంలోని సీతా రామచంద్ర స్వామివారికి పంచామృతాభిషేకాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఆధ్వర్యంలో మరింగంటి వరదాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### నేడు కోలంకలో గడప గడపకూ మన ప్రభుత్వం

**రామచంద్రపురం రూరల్:** కాజులూరు మండలం కోలంక గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొంటారని మంత్రి అడిషనల్ పీఎస్ పి.తేజేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు రామచంద్రపురం పట్టణంలోని 4వ వార్డు సచివాలయం పరిధిలో 'గుడ్ మార్నింగ్ రామచంద్రపురం', 10 గంటలకు రామచంద్రపురం మండలం తాళ్లపొలం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని తెలిపారు.

### నేడు కె.గంగవరంలో ఆరోగ్య సురక్ష

**కె.గంగవరం:** మండల పరిధిలోని కె.గంగవరంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి స్థానికంగా గల రామాలయం వద్ద మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని వైద్యులతో పాటు మందులు ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు.

### బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగాలి



తాతపూడిలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకారావు

**కపిలేశ్వరపురం:** బీసీ సామాజిక వర్గీయులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మల్కాపురం కనకారావు అన్నారు. తాతపూడిలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెన్నేటి నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన బీసీ సామాజిక వర్గీయుల ఆత్మీయ సమావేశంలో కనకారావు మాట్లాడారు. బీసీ సామాజిక వర్గీయులకు చెందిన పలు స్థానిక సమస్యలపై చర్చించి సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని ద్రాక్షారామలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఫిట్ ఇండియా స్వచ్ఛత ఫ్రీడమ్ రన్ 4.0 కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లు, చెత్త తొలగించాలని స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.రాజేశ్, డైరెక్టర్ జి.నాగ సోమేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాకోరాజు పాల్గొన్నారు.

### అదనపు వసతి, సౌకర్యాలు

**కొత్తపేట:** స్థానిక సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు వసతి, మరుగుదొడ్ల సంఖ్య పెంచేందుకు నిధులు కేటాయిస్తామని సాంఘిక సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, వసతి సౌకర్యాలు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అదనపు గదులు, మరుగుదొడ్లతో పాటు డైనింగ్ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మండల పరిధిలోని వాడపాలెం పెదపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులతో కలిసి కింద కూర్చుని వారితో ముచ్చటించారు. మెనూ గురించి కార్యకర్త, ఆయాలను ఆరా తీశారు. రికార్డులను ఆట వస్తువులను, పిల్లల ఎత్తు, బరువులు గ్రోత్ మోనటరింగ్, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లలోని వస్తువుల నాణ్యతను పరిశీలించారు. బాలింతలు, గర్భిణులు ఈ మాసంలో టేక్ హోమ్ రేషన్ ఎంతవరకు తీసుకున్నారు? అని రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట ఆర్‌డీఓ ఎం.ముక్కంటి, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఎంపీడీఓ మహేశ్వరరావు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యనారాయణ ఉన్నారు.

# అమ్మ కడుపు చల్లగా..

- ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన సాధారణ ప్రసవాలు
- గతానికి భిన్నంగా వైద్యసేవలు
- తల్లీబిడ్డ వాహనం ద్వారా ఇంటికి



ఏరియా ఆసుపత్రిలో బాలింతకు డిశ్చార్జ్ సమయంలో ఆరోగ్య శ్రీ కిట్‌ను అందిస్తున్న వైద్యులు

**రామచంద్రపురం:** మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం గట్టి చర్యలను తీసుకుంటోంది. గతానికి భిన్నంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో గర్భిణులకు వైద్య సేవలను మెరుగు పర్చటంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే పురుడు పోసుకునేందుకు అధిక శాతం మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ, జననీ సురక్ష పథకాల ద్వారా ప్రోత్సాహాలను అందజేస్తోంది. గత ఏప్రిల్ నుంచి నేటి వరకు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరు నెలల్లో 695 మంది గర్భిణులకు వైద్యులు పురుడు పోశారు.

**గతంలో నిరాశ**

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పురుగు పోసుకోవాలంటేనే గర్భిణులు భయపడే వారు. వైద్యులు లేక, మందులు లేక సరైన సౌకర్యాలు లేక ఎంతో ఇబ్బందులు పడేవారు. ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులుండేవి. అప్పట్లో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు అసలు జరిగేవి కావు. డెలివరీ కోసం వెళ్లి గర్భిణులకు సిజేరియన్ తప్పనిసరిగా చేసేవారు. నేటి ప్రభుత్వం నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యం ఇస్తోంది.

**నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ**

ఏరియా ఆసుపత్రిలో నిపుణులైన గైనకాలజిస్టులతో గర్భిణులను నిరంతర పర్యవేక్షిస్తూ వైద్య సేవలను అందిస్తున్నారు. మొదటి నెల నుంచి డెలివరీ డేట్ వరకు ఏరియా ఆసుపత్రిలో సేవలందిస్తున్నారు. అవసరమైతే తప్ప మిగిలిన సమయంలో సాధారణ ప్రసవాలను చేస్తున్నారు. ప్రతీ నెలలో 32 నుంచి 40 వరకు అంటే ఏరియా ఆసుపత్రికి వచ్చే గర్భిణులలో సుమారు 90శాతం సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయి.

**ఆరోగ్య శ్రీ ద్వారా ఆసరా..**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అయిన బాలింతలకు ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా ఆసరా కల్పిస్తోంది. సాధారణ ప్రసవాలతో పాటుగా సిజేరియన్ అయిన వారికి కూడా ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన మరుసటి రోజునే రూ.4వేలు తల్లుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తుంది. దీంతోపాటుగా అదనంగా ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయిన బాలింతలకు జననీ సురక్ష ద్వారా అదనంగా మరో రూ.1,000ను వారి ఖాతాలకు జమ చేస్తుంది. దీంతోపాటుగా ఆసుపత్రిలో డెలివరీ అయిన బాలింతలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన తల్లీబిడ్డ వాహనం ద్వారా ఉచితంగా వారి ఇంటి వద్దకు చేరుస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గర్భిణులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించటంతో పేదలతో పాటు మధ్యతరగతి ప్రజలు కూడా ప్రభుత్వ ఆసుపత్రులనే ఆశ్రయిస్తున్నారు.

| నెల | మొత్తం డెలివరీలు | నార్మల్ డెలివరీలు |
|---|---|---|
| ఏప్రిల్ | 66 | 32 |
| మే | 70 | 70 |
| జూన్ | 74 | 37 |
| జూలై | 78 | 33 |
| ఆగస్టు | 80 | 45 |
| సెప్టెంబర్ | 69 | 40 |
| అక్టోబర్ 10 వరకు | 32 | 20 |
| మొత్తం | 469 | 226 |

**సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం**



గర్భిణులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సదుపాయాలను కల్పిస్తోంది. సాధారణ ప్రసవం ద్వారా మహిళలు ఆరోగ్యం బాగుంటుంది. అందుకోసం గతంలో మాదిరిగా కాకుండా గర్భిణులకు సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవం అయ్యే విధంగా చూస్తున్నాం. మొదటిసారి సిజేరియన్ అయితే రెండవ సారి కూడా సిజేరియన్ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. అందుకే నార్మల్ డెలివరీకి ప్రయత్నిస్తున్నాం.

– డాక్టర్ వీరభద్రుడు, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, రామచంద్రపురం

# పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

- వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్
- మెర్నిపాడు, కోరుమిల్లి తదితర గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న పృథ్వీరాజ్, మెర్నిపాడు సర్పంచ్ సౌజన్య



కోరుమిల్లి సురక్ష శిబిరంలో చికిత్స చేస్తున్న డాక్టర్ రాకేష్ కృష్ణ చౌదరి

**మండపేట:** జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని మెర్నిపాడు సర్పంచ్ గారపాటి సౌజన్య, పార్టీ నేత అశోక్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం ఆ గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పృథ్వీరాజ్ ప్రారంభించారు. పార్టీ నేత అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తోడ్పాటుతో మెర్నిపాడును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగనవాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను పృథ్వీరాజ్, పార్టీ నాయకులు సందర్శించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. శిబిరంలో 250 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీఓ ఐ. రాజు, ఈఓ వర్మలు శిబిరం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, వెలగతోడు సొసైటీ చైర్మన్ ముక్కపాటి కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్ నాయుడు, పార్టీ నాయకులు చిటికెన వీర్రాజు, పిల్లా అరవరాజు, అడ్డాల రామారావు, పిల్లా సూరిబాబు, తోరం శ్రీనివాస్, యనమదల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**కోరుమిల్లిలో 556 మందికి**

**కపిలేశ్వరపురం:** మండలంలోని కోరుమిల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు 556 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో సేవలను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.చంద్రమౌళి, సీహెచ్ రాకేష్ కృష్ణ చౌదరి పర్యవేక్షించారు. వివిధ ఆసుపత్రుల వైద్య నిపుణులు గర్భకోశ వ్యాధులు ఎనిమిది, ఎముకల వ్యాధులు 68, చిన్నారులు 21, నేత్ర వ్యాధులు 105, జనరల్ వ్యాధులకు సంబంధించి 354 మందికి చికిత్స అందించారు. శిబిరంలో వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యులు రాకేష్ కృష్ణ చౌదరి, అచ్యుతాపురం, మండపేటలకు చెందిన వైద్య నిపుణులు సేవలందించారు. ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో అంగన్‌వాడీలు ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీఈఓ పీడీడీ బిషప్, ఎంపీహెచ్ఎస్ వీఎస్ కామేశ్వరరావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**పేదల వైద్యానికి సీఎం జగనన్న పెద్దపీట**

**కాజులూరు:** రాష్ట్రంలో పేదల వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. మంగళవారం బందనపూడిలో గ్రామ సర్పంచ్ డేగల తిరుమళవేణి అధ్యక్షతన అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసురాజు మాట్లాడుతూ సీఎం జగనన్న పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలతోపాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పలు పథకాలను రూపొందించారన్నారు. ప్రజారోగ్యం కోసం పెద్ద ఎత్తున పథకాలు రూపొందిస్తున్నా గ్రామాలలో ప్రజలు చిన్న, చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యంచేస్తూ క్రమేపీ దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారనే భావనతో ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులతో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్సనందిస్తామన్నారు. ఎంపీపీ మాత భారతి, ఎంపీటీసీ సభ్యుడు సలాది లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ కాకతీయ రాజు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



బందనపూడిలో రోగికి మందుల కిట్ అందిస్తున్న నాయకులు, వైద్య సిబ్బంది



రాయవరంలో రోగులకు మందులు అందజేస్తున్న నేతలు

**రాయవరంలో 603 మందికి..**

**రాయవరం:** పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నారని మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి అన్నారు. రాయవరంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ ప్రారంభించారు. వైద్యులు బి.సౌమ్య, వంశీకృష్ణ, రమ్యశ్రీ , శ్రీనివాస్‌లు రోగులకు వైద్యసేవలందించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో 603 మందికి వైద్య సేవలు అందించారు. ఇందులో 110 మంది నేత్ర వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గంటి రోజా, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, తాడి రామచంద్రారెడ్డి, మంతెన అచ్యుతరామరాజు, కొల్లి రాంబాబు పాల్గొన్నారు.

### దసరా మహోత్సవాలకు మంత్రి వేణుకు ఆహ్వానం



మంత్రి వేణుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ తారకేశ్వరరావు

**రామచంద్రపురం రూరల్:** ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 28 వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు మంగళవారం ఈఓ పితాని తారకేశ్వరరావు ఆహ్వాన పత్రిక అందజేశారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా ఈ ఏడాది అమ్మవారిని తొమ్మిది అవతారాల్లో అలంకరించనున్నట్లు తెలిపారు. అభిషేక పురోహితులు మైలవరపు శ్రీమన్నారాయణ, ఆలయ అర్చకులు మద్దిరాల రఘునందన్, చండీ హోమ పండిట్ ఇంద్రకంటి రామారావు శర్మ పాల్గొన్నారు.

### భారీఎత్తున అన్న సమారాధన

**మండపేట:** పట్టణంలోని 2వ వార్డు పెద కాలువ వంతెన వద్ద గల మైత్రి మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ప్రారంభించారు. మూడు వేల మందికి పైగా భక్తులు హాజరై స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అసోసియేషన్ నాయకులు రేలంగి వేణుగోపాలరావు, మాండ్రు వరప్రసాద్ చౌదరి, తీరం దాసు శివకుమార్, కాపా మధుకుమార్, కటారి శ్రీనివాస్, యాదగని సత్యప్రసాద్, వై.నాగేశ్వరరావు, కడియాల వెంకటరమణ, చల్లపల్లి శివ, బెల్లపుకొండ వీరేంద్ర కుమార్, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు

### విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ



విద్యార్థినికి బస్‌పాస్ అందిస్తున్న ఆర్టీసీ అధికారులు, టీచర్లు

**రాయవరం:** మండలంలోని వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం డి.సత్తిరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్టీసీ రామచంద్రపురం డిపోకు చెందిన జీడీవీపీ కుమార్, ఐ.సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు. కాకినాడకు చెందిన సత్య స్కాన్ అండ్ డయాగ్నొస్టిక్ సౌజన్యంతో పాఠశాలలో చదువుతున్న 6–10 తరగతుల విద్యార్థినులకు ఉచిత బస్‌పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవీవీ ప్రభాకరరావు, పీఎస్ తిరుమలరావులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో టెన్నికాయిట్ విజయోత్సవం



క్రీడాకారులను సత్కరించిన ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు

**మండపేట:** సౌతాఫ్రికాలో నిర్వహించిన వరల్డ్ టెన్నికాయిట్ చాంపియన్ షిప్‌ను భారత్ కైవశం చేసుకోవడంతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజయోత్సవం నిర్వహించారు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించి భారత్‌కు గోల్డ్ మెడల్ సాధించిన వారిలో మండపేటకు చెందిన వడ్డాది వినయ్‌కుమార్, పిల్లా రామారావు ఉన్న విషయం విదితమే. రామారావు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ఫస్టియర్ చదువుతున్నాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం వారికి అభినందన సభ నిర్వహించారు. పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఆడి దేశానికి చాంపియన్‌షిప్ తీసుకురావడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యతో పాటు ఆటల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం రామారావు, వినయ్, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్ రమేష్‌లను ఘనంగా సత్కరించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హెడ్ టి. త్రినాథ్, పీడీ ఎస్.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి పాటుపడాలి



వీరబాబును సత్కరిస్తున్న పృథ్వీరాజ్ తదితరులు

**మండపేట:** ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లడం ద్వారా వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటు పడాలని ఆ పార్టీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా నియమితులైన పిల్లా వీరబాబును మంగళవారం పార్టీ నేత గారపాటి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పృథ్వీరాజ్, రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తదితరులు మెర్నిపాడులో సత్కరించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ శక్తి వంచన లేకుండా పార్టీ బలోపేతానికి పాటు పడతానన్నారు. సొసైటీ చైర్మన్ ముక్కపాటి కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు, పార్టీ నాయకులు పిల్లా అరవరాజు, తోరం శ్రీనివాస్, చిటికెన వీర్రాజు, అడ్డాల రామారావు, యనమదల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆజాదీకా అమృత మహోత్సవ్ కలశ యాత్ర



కె.గంగవరంలో అమృత కలశ యాత్ర నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**కె.గంగవరం:** మండల కేంద్రమైన కె.గంగవరంలో మంగళవారం ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు అమృత కలశ యాత్ర నిర్వహించారు. తొలుత విజయా కల్యాణ మంటపం వద్ద జెండా వందనం చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పేకేరు గ్రామానికి చెందిన ఆర్మీ అధికారి పెట్టా శ్రీనివాస్‌కు నివాళులు అర్పించి ఆయన భార్యను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. కల్యాణ వేదిక వద్ద నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ప్లకార్డులు, నినాదాలు, వేషధారణలతో అమృత కలశ యాత్ర నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఓబులనేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, నీతిపూడి మదుబాల, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ పాల్గొన్నారు.

## క్రీడలలో నైపుణ్యానికి శిక్షణ దోహదం



గొల్లపాలెంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

**కాజులూరు:** క్రీడలలో నైపుణ్యం సాధించడానికి, విజయ సాధనకు శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డగళ్ళ నాగరాంప్రసాద్ అన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకూ నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డలో రాష్ట్ర స్థాయి సీనియర్, పురుషులు, మహిళల సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల స్థాయిలో బాలుర, బాలికల విభాగం నుంచి రెండు టీమ్‌లను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు గొల్లపాలెంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ పీడి జి. సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళవారం సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అడ్డగళ్ళ నాగరాంప్రసాద్ శిక్షణ తరగతులు ప్రారంభించి క్రీడాకారులకు ఆటలో మెళకువలు నేర్పారు. ఈ నెల 14 వ తేది శనివారం వరకూ శిక్షణ తరగతులు కొనసాగుతాయని అనంతరం క్రీడాకారులు నంద్యాల వెళతారన్నారు.

### మరిదిపై వదిన కత్తితో దాడి

**అంబాజీపేట:** స్థల వివాదం నేపథ్యంలో మంగళవారం మరిదిపై వదిన కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఇరుసుమండకు చెందిన మట్టా రామాంజనేయులు ఇంటి వద్ద ఉన్న స్తంభాల వద్ద అతని వదిన సుజాత గునపంతో తవ్వుతోంది. స్తంభాల వద్ద తవ్వ వద్దని రామాంజనేయులు భార్య సుధ అడ్డుకుంది. ఈ నేపథ్యంలో సుధ కింద పడిపోవడంతో ఆమె భర్త పైకి లేవదీసే ప్రయత్నం చేస్తుండగా సుజాత కత్తితో దాడి చేసింది. రామాంజనేయులు ఎడమ చేతికి తీవ్ర గాయాలు కాగా అమలాపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

### ట్రాక్టర్ డ్రైవర్‌కు ఏడాది జైలు

**మలికిపురం:** సైకిలిస్టు మృతికి కారణమైన గూడపల్లి పల్లిపాలేనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ లంకే డేవిడ్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ రాజోలు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.హిమబిందు మంగళవారం తీర్పు ఇచ్చారు. 2020లో మలికిపురం మండలం అడవిపాలేనికి చెందిన తాడిచర్ల నాగవీర వెంకట సత్యనారాయణను ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందాడు. ఎస్సై నాగరాజు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ నల్లి ఆనంద్ కేసును వాదించగా కోర్టు కానిస్టేబుల్ హసన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది.

## రెండు వర్గాల విద్యార్థుల మధ్య ఘర్షణ

**అమలాపురం టౌన్:** అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న కొందరు విద్యార్థులు రెండు గ్రూపులుగా ఏర్పడి మంగళవారం ఘర్షణకు దిగారు. స్థానిక భూపయ్య అగ్రహారంలో రెండు వర్గాల విద్యార్థులు ఒకరినొకరు తోసుకుంటూ గలాటా సృష్టించారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ సిబ్బందితో తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాల విద్యార్థులను చెదరగొట్టారు. ఇటీవల కళాశాలలో జరిగిన ఫేర్‌వెల్ ఫంక్షన్‌కు సంబంధించి జరిగిన వివాదం కాస్తా ఘర్షణకు దారి తీసింది. జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ఘర్షణకు కారణమైన విద్యార్థులను గుర్తించి కేసులు నమోదు చేసేందుకు కూడా వెనకాడమని సీఐ క్రాంతి కుమార్ హెచ్చరించారు. పది రోజుల క్రితం ఇదే కళాశాలకు చెందిన విద్యార్థులు స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ సెంటరులో ఘర్షణకు దిగారన్న చర్చ సాగుతోంది.

### సాగర్ కవచ్ ట్రయల్ రన్

**సఖినేటిపల్లి:** అంతర్వేది తీరంలో గస్తీ కాస్తున్న మెరైన్ సిబ్బందికి అగంతకులు తారసపడిన సందర్భంలో తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై సాగర్ కవచ్ ప్రోగ్రాంలో భాగంగా వారు ట్రయిల్ రన్ మంగళవారం నిర్వహించారు. అన్నా చెల్లెలు గట్టు వద్ద గస్తీ తిరుగుతున్న అంతర్వేది కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.పెద్దిరాజు, ఎస్సై పి.సోమశేఖర్‌రెడ్డి, సిబ్బందికి అనుమానాస్పదంగా ఓ బోటులో ఐదుగురు వ్యక్తుల తీరానికి వచ్చినట్టు గుర్తించారు. ఇందులో ఇద్దరు దిగి ఆర్‌డీఎక్స్‌తో లైట్ హౌస్ వెనుక భాగం నుంచి అటాక్ చేయడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో వారిని వెంబడించి పట్టుకొని తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న ఆర్‌డీఎక్స్ బాక్స్‌ను సీఐ పెద్దిరాజు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. సిబ్బంది రమేష్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, కుమార్, నాగార్జున, సతీష్ పాల్గొన్నారు.